సాక్షి వైఎస్సార్ జిల్లా

గురువారం । 26 । జూన్ । 2025



సీటు వదలని అక్రమార్కుడు!

కడప ఇంటర్మీడియట్ డీఐఈఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఒక వ్యక్తి కళాశాలకు వెళ్లకుండా అనధికారంగా విధులు నిర్వహిస్తున్నారు. -8లో



బీటెక్ రవి బంధువు వీరంగం

పులివెందుల నియోజకవర్గంలో రోజురోజుకు టీడీపీ గుండాలు రెచ్చిపోతున్నారు. దాడులు, బెదిరింపులతో చెలరేగిపోతున్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
34.0/27.7

వాతావరణం

జిల్లాలో బుధవారం 27.7 - 34.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 11.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వాకథాన్ ర్యాలీని జయప్రదం చేయండి

కడప సెవెన్‌రోడ్స్: అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ సందర్భంగా గురువారం కడప నగరంలో నిర్వహించే వాకథాన్ ర్యాలీని జయప్రదం చేయాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఈ అంశంపై నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. గురువారం సాయంత్రం 4.30 గంటలకు కడప కోటిరెడ్డిసర్కిల్ నుంచి ఏడురోడ్ల కూడలి వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, ప్రజలు, వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 240 మంది హాజరు



పత్రాలను పరిశీలించుకుంటున్న పాలిసెట్ అభ్యర్థులు

కడప ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు జిల్లావ్యాప్తంగా 68001వ ర్యాంకు నుంచి 86 వేల ర్యాంకులకు సంబంధించిన 240 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ మేరకు తమ ధ్రువపత్రాలను పరిశీలించుకున్నారు. ఈ కౌన్సెలింగ్ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి, ఛీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ పద్మజ, వెరిఫికేషన్ ఆఫీసర్లు ప్రసాద్, ప్రశాంతి, ప్రసన్న, రాజేష్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి కౌన్సెలింగ్‌కు...

జిల్లావ్యాప్తంగా 86001 నుంచి 104000 వేల ర్యాంకులు వచ్చిన అభ్యర్థులకు గురువారం కౌన్సెలింగ్ ఉంటుందని కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు.


వర్ధిని కన్‌స్ట్రక్షన్స్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ మేయర్ కె. సురేష్ బాబు తనయుడు రిజిస్టర్ చేసిన వర్ధిని కన్‌స్ట్రక్షన్స్ సంస్థను రద్దు చేస్తూ పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జీవో ఆర్‌టీ నంబర్ 625ను జారీ చేశారు. వర్ధిని కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ద్వారా కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనులు చేయడంపై కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ చేసి ప్రభుత్వానికి సమర్పించారు. వారి నివేదిక మేరకు పురపాలక శాఖ మేయర్ సురేష్ బాబుపై అనర్హత వేటు వేస్తూ ఏప్రిల్‌లో ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై మేయర్ సింగిల్ బెంచ్‌ను, ఆ తర్వాత డివిజనల్ బెంచ్‌ను ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు ఇటీవల మళ్లీ విచారణ జరిపిన అధికారులు వర్ధిని కన్‌స్ట్రక్షన్స్ సంస్థను రద్దు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించారు.

29న బీసీ మహాసభ

మదనపల్లె సిటీ: మదనపల్లెలో ఈనెల 29న జరిగే బీసీ మహాసభను జయప్రదం చేయాలని బీసీ జనసభ వ్యవస్థాపకుడు బోడే రాజశేఖర్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బీసీలకు ఏం చేసిందని ప్రశ్నించారు.

బొల్లి మచ్చలు అంటువ్యాధి కాదు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పెంచలయ్య

కడప కోటిరెడ్డిసర్కిల్: బొల్లిమచ్చలు ఒకరినుంచి సంక్రమించే అంటువ్యాధి కాదని రిమ్స్ డెర్మటాలజీ విభాగాధిపతి డాక్టర్ పెంచలయ్య అన్నారు. ప్రపంచ బొల్లి మచ్చల దినోత్సవం సందర్భంగా కడప రిమ్స్‌లోని చర్మవ్యాధుల(డెర్మటాలజీ) విభాగంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ బొల్లి మచ్చలు వంశపారపర్యంగా, ఒకరి నుంచి ఒకరికి వచ్చే వ్యాధి కాదన్నారు. బొల్లి మచ్చలతో ఒక వ్యక్తి శారీరక, మానసిక సామర్థ్యంపై ఎలాంటి ప్రభావం ఉండబోదన్నారు. ప్రారంభ దశలోనే చర్మవ్యాధుల నిపుణుల పర్యవేక్షణలో వైద్యం చేయించుకోవాలని సూచించారు. తెల్ల మచ్చలు, బొల్లి మచ్చలున్న వారిపై వివక్ష చూపకుండా సమాజంలో అందరితో సమానంగా ఆదరించాలన్నారు. డెర్మటాలజీ విభాగం వైద్యులు డాక్టర్ సుభాషిణి, డాక్టర్ నరోత్తమ రెడ్డి, డాక్టర్ విజయకుమారి పాల్గొన్నారు.

వైద్య శాఖ రూటు.. సపరేటు

వైద్యశాఖ రూటే.. సప'రేటు'గా తయారైంది. ఇటీవల జరిగిన వైద్య శాఖ బదిలీల్లో చోటుచేసుకున్న నిర్లక్ష్య ఘటనే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఓ ఉద్యోగిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ చేపట్టకుండా... అతడిని కోరిన చోటికి బదిలీ చేసి అందలం ఎక్కించడం అధికారుల నిర్లక్ష్యానికి.. అవినీతికి అద్దం పడుతోంది.

- ఉద్యోగిపై ఆరోపణలు..చర్యలు తీసుకోవాలని 'డీఎంఈ' ఆదేశాలు
- ఆ ఆదేశాలను అటకెక్కించి దర్జాగా బదిలీ చేసిన వైనం
- వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో వెలుగు చూస్తున్న బది'లీలలు'



వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో రోజుకో అవినీతి పర్వం వెలుగు చూస్తోంది. ముఖ్యంగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులపై ఏ మాత్రం చర్యలు చేపట్టడం లేదు. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలను సైతం చెత్త బుట్టలో పడేస్తున్నారు. పైగా సదరు ఆరోపణలు వచ్చిన వారిని అందలం ఎక్కిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

- కడపలోని ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు జూమ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలను చేపట్టారు. ఇందులో ఆరోపణలు ఎదుర్కొంటూ కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పనిచేస్తున్న ఓ సీనియర్ అసిస్టెంట్‌ను స్వాప్ కింద కడప సర్వజన ఆసుపత్రికి బదిలీ చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ బదిలీపై, అధికారులు, సంబంధిత సిబ్బంది తీరుపై అనుమానాలు కలుగుతున్నాయి. సదరు సీనియర్ అసిస్టెంట్‌పై ఐదేళ్ల కిందట అవినీతి ఆరోపణలు రావడంతో అప్పటి ఆఫీస్ సూపరింటెండెంట్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)కు ఫిర్యాదు చేశారు.

తాజాగా దీనిపై ఈ నెల 9వ తేదీన డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఎడ్యుకేషన్ నుంచి కడప రీజనల్ డైరెక్టర్ మెడికల్ అండ్ హెల్త్, కడప సూపరింటెండెంట్ జనరల్ హాస్పిటల్‌కు ఆదేశాలు వచ్చాయి. 'నాలుగేళ్లు దాటుతున్నా ఇంత వరకు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఎందుకు విచారణ చేపట్టలేదు. విచారణ అధికారిని ఎందుకు నియమించలేదు. తక్షణం విచారణ చేపట్టి నివేదికను పంపాలి. లేదంటే అందరిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని' అందులో పేర్కొన్నారు. ఈ ఆదేశాలను ఇటు కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం అటు కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

- ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులపై ఇక్కడి అధికారులు ఎందుకు విచారణ చేపట్టలేదు..? తాజాగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినప్పటికీ, విచారణ చేపట్టకుండా పై అధికారుల ఆదేశాలను దాచిపెట్టారా..;? అనే సందేహాలు కలుగుతున్నాయి. ఈ అంశానికి సంబంధించి పెద్దం మొత్తంలోనే చేతులు మారినట్లుగా ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

మరికొన్నింటిపై ఆరోపణలు

సీనియర్ అసిస్టెంట్స్‌కు సంబంధించి కర్నూలు, అన్నమయ్య, చిత్తూరుతో పాటు వైఎస్సార్ కడప జిల్లాలో జరిగిన కొన్ని బదిలీలపై పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. ఉదాహరణకు కొంత మందిని ఉన్న చోటే ఉండమని చెప్పారు. తరువాత వారిని కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి లాంటి కీలకమైన స్థానాలకు బదిలీ చేశారు. పారదర్శకంగా బదిలీలు జరిగాయని చెప్పుకుంటున్నా, కొన్ని బదిలీలపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు చుట్టుముట్టాయి.

- వైద్య ఆరోగ్య విభాగం కీలకమైన శాఖ. ఇక్కడ ఎత్తులకు పై ఎత్తులు ఉంటాయి. ప్రభావం చూపే ఉద్యోగులు ఉంటారు. అనుకున్న వారిని అనువైన చోటికి రప్పించడానికి..పంపించడానికి ఎత్తుగడలు దండిగానే ఉంటాయి. పరపతి..పలుకుబడి ప్రభావం చూపిస్తుంది. నిబంధనల ప్రకారం ఉద్యోగులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ శాఖ పరిధిలో పనిచేసే ఉద్యోగులు కోరుతున్నారు.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం



ఇప్పుడు చేపట్టిన బదిలీలకు..అవినీతి ఆరోపణలకు సంబంధం లేదు. అవినీతి ఉద్యోగులపై విచారణ చేపట్టిన తరువాత చట్టపరమైన చర్యలు చేపడుతాం. ఎవ్వరినీ ఉపేక్షించం. ఈ అంశంపై ఆరా తీస్తాను. విచారణ జరిగేలా చర్యలు చేపడుతాను. నిబంధనల ప్రకారమే బదిలీలను చేపట్టాం.

– డాక్టర్ రామగిడ్డయ్య, రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4

పశువుల పెంపకం కోసం భూములు

- ప్రయోగాత్మకంగా మైదుకూరులో అమలు
- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, చిత్రంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్, ఎస్పీ అశోక్ కుమార్

మైదుకూరు: భూమిలేని పేదలకు వ్యవసాయం కోసం భూములు ఇచ్చినట్టుగా పశువుల పెంపకం కోసం కూడా అర్హులకు భూములివ్వాలని ప్రణాళిక తయారు చేస్తున్నట్టు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ వెల్లడించారు. బుధవారం సాయంత్రం మైదుకూరులోని ఓ కల్యాణ మండపంలో నియోజకవర్గ అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పశువుల పెంపకంతో ఆదాయం పొందాలనుకునే వారికి భూములు ఇవ్వాలనే ప్రణాళిక ఉందని.. రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా మైదుకూరు నియోజకవర్గం నుంచే ప్రారంభించాలని కసరత్తు చేస్తున్నట్టు తెలిపారు. ఒక పాలిచ్చే గేదె ఒక ఎకరా భూమితో సమానమని నానుడి ఉన్నట్టు ఒక కుటుంబం ఒక గేదెను పెంచుకుంటే ఒక ఎకరా ద్వారా వచ్చేంత ఆదాయం వస్తుందని కలెక్టర్ అన్నారు. పశువుల పెంపకం కోసం ఎన్‌ఎల్‌ఎఫ్ పథకం ద్వారా బ్యాంకు నుంచి రూ.50లక్షల వరకు రుణం లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీ అందుతుందన్నారు. నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు ఉత్సాహవంతులైన యువకులు ముందుకు వచ్చి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడారు. సమావేశంలో ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, జేసీ అదితి సింగ్, బద్వేలు, జమ్మలమడుగు ఆర్డీఓలు చంద్రమోహన్, సాయిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో జిల్లా నేతలు



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న జిల్లా నేతలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మేయర్, జిల్లా అధ్యక్షులు తదితరులు హాజరయ్యారు. బుధవారం విజయవాడలోని తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా నుంచి పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీలు పి. రామసుబ్బారెడ్డి, రమేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, కడప మేయర్ కె. సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జూలై 9న సార్వత్రిక సమ్మె

మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత

కడప కార్పొరేషన్: కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా మార్చే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న సార్వత్రిక సమ్మె నిర్వహించనున్నట్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) గౌరవాధ్యక్షులు కేసీ బాదుల్లా, జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు నరసింహులు తారక రామారావు తెలిపారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డికి వారు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 గంటల పని విధానం స్వస్తిపలకాలని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని తదితర డిమాండ్ల సాధనకు జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనున్నట్లు చెప్పారు. మున్సిపల్ కార్మికులందరికీ షరతులు లేకుండా తల్లికి వందనంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ 36 ప్రకారం జీతాలు పెంచాలని, ఆప్కాస్ రద్దు చేసి ఏజెన్సీలకు అప్పగించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి వెంకటాద్రి నాయకులు జనార్ధన రాజశేఖర్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపు జమ్మలమడుగులో జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని జమ్మలమడుగు పట్టణంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీసీ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు జమ్మలమడుగు పట్టణం ముద్దనూరు రోడ్డులోని శ్రీనివాస డిగ్రీ కళాశాలలో ఈ జాబ్‌మేళా ఉంటుందని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డి.ఫార్మసీతోపాటు పీజీ, డిగ్రీ చదివిన వారు ఇందుకు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

టీడీపీలో కలవరం!

- వైఎస్ జగన్ సమక్షంలో పార్టీలో చేరిన సుగవాసి బాలసుబ్రమణ్యం
- అన్నమయ్య జిల్లాలో ఇదే బాటలో మరికొందరు



వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన సుగవాసి బాలసుబ్రమణ్యం, చిత్రంలో పార్టీ నేతలు

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లా తెలుగుదేశం పార్టీలో కలవరం మొదలైంది. పార్టీ అధిష్టానం కీలక నేతలను పట్టించుకోకపోవడం....పట్టున్న నేతలను విస్మరిస్తుండడం పరిస్థితి బట్టి చూస్తే భవిష్యత్తులో మరికొంతమంది టీడీపీ నేతలు వలస బాట పట్టనున్నారు. టీడీపీలో గట్టి పట్టున్న వారిని పట్టించుకోకపోవడం, నియోజక వర్గ ఇన్‌ఛార్జిలను ప్రకటించకపోవడం, ప్రస్తుత సర్కార్‌లో అవినీతి కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నా మిన్నకుండిపోతుండడం వంటి ఘటనలతో పార్టీలో సీనియర్ నాయకులు మనస్తాపం చెందుతున్నారు. ఎప్పటినుంచో పార్టీని నమ్ముకుని.. పార్టీనే దైవంగా భావించిన వారికి ఎదురు దెబ్బలు తప్పడం లేదు. కష్టపడి పనిచేసిన వారికి కాకుండా అప్పటికప్పుడు పార్టీలోకి వచ్చిన వారికి టీడీపీ అధిష్టానం పదవులు కట్టబెడుతుండడంపై కూడా పార్టీలోని సీనియర్ నాయకులు రగలిపోతున్నారు. ప్రధానంగా జిల్లాలో కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకులను టీడీపీ కరివేపాకులా వాడుకుని వదిలేసిందన్నది మెజార్టీ ప్రజల నుంచి అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలోనే ఎన్ని అవమానాలకు గురిచేసినా పార్టీ అంటిపెట్టుకుని పనిచేసిన మాజీ జెడ్పీ చైర్మన్, టీడీపీ రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి, మాజీ ఎంపీ దివంగత సుగవాసి పాలకొండ్రాయుడు పెద్ద కుమారుడు సుగవాసి బాలసుబ్రమణ్యంను పార్టీ అధిష్టానం అవమానాలకు గురి చేయడంతో తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేశారు. మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో టీడీపీలో కలవరం మొదలైంది.

రాజంపేట నుంచి పోటీ చేసినా ఇన్‌ఛార్జి ఇవ్వని టీడీపీ

సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట స్థానం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా సుగవాసి బాలసుబ్రమణ్యం పోటీ చేశారు. పాలకొండ్రాయుడు కుటుంబం నుంచి రాయచోటికి అవకాశం పరిశీలించాలని పదేపదే అడిగినా కాదని, రాజంపేట నియోజకవర్గం అప్పగించారు. అయినా సుగవాసి బాలసుబ్రమణ్యం వెనుకంజ వేయకుండా రాజంపేట టీడీపీ టిక్కెట్‌పై పోటీ చేశారు. ఏరు దాటకముందు ఓడ మల్లన్న..ఏరు దాటాక బోడి మల్లన్న అన్న చందంగా ఎన్నికలకు ముందు ఒక తరహాలో, ఎన్నికలు తర్వాత మరో తరహాలో టీడీపీ అధిష్టానం వ్యవహరించడంపై పార్టీలో తీవ్ర చర్చ జరుగుతోంది. ఎన్నికల తర్వాత ఓడిపోయిన అభ్యర్థికి అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ ఇన్‌ఛార్జి పదవిని కట్టబెట్టకుండా నాన్చుడు ధోరణితో ముందుకు వెళ్లింది. అంతవరకు బాగానే ఉన్నా మరోపక్క ఇంకో నాయకుడిని అదే నియోజకవర్గంలో ప్రోత్సహించడం వెనుక పొమ్మనకుండానే పొగబెట్టినట్లు అర్థమవుతోంది. ఎన్నికల సందర్భంగా భారీగా ఖర్చు చేసుకుని పార్టీ కోసం అన్ని విధాల అగచాట్లు పడిన వారిని కాదని, ఇతరులను ప్రోత్సహించడంపై తెలుగు తమ్ముళ్లలో చర్చకు దారి తీసింది. అవమానాలు ఎదుర్కొంటూ...పదవి ఇవ్వకపోయినా పార్టీ కోసం పనిచేస్తున్న సుగవాసిని టీడీపీ అధిష్టానం పట్టించుకోకపోవడంతో ఆయన పార్టీని వీడాల్సి వచ్చింది.

రాయచోటిలో 'సుగవాసి' కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి నియోజకవర్గంలో మాజీ ఎంపీ, దివంగత సుగవాసి పాలకొండ్రాయుడు కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. రాజకీయాల్లోకి వచ్చిన తొలినాళ్ల నుంచి కూడా తెలుగుదేశం పార్టీకి నమ్ముకునే పాలకొండ్రాయుడు కుటుంబం రాజకీయాలు చేసింది. అంతేకాకుండా రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లెలో కూడా సుగవాసి కుటుంబాన్ని అభిమానిస్తూ వారి వెంట నడుస్తున్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా ఇలా వివిధ హోదాల్లో పనిచేసి పార్టీకోసం అహర్నిశలు కష్టపడిన పాలకొండ్రాయుడిని చివరి గడియల్లో కూడా అధిష్టానం పట్టించుకోలేదు. ఎన్నికల సమయంలో ఆరోగ్యం సహకరించకపోయినా టీడీపీకి ఓటు వేయాలంటూ ప్రచారం చేసిన పాలకొండ్రాయుడు ఇటీవల మృతి చెందినంతరం కూడా ఆ కుటుంబాన్ని పట్టించుకోకపోవడం ఆయన అభిమానులను తీవ్రంగా కలిచివేసింది. ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు టీడీపీలో ప్రధాన నేతలు రాకపోవడం, మహానాడు కార్యక్రమంలో సంతాపాన్ని తెలియజేయకపోవడం అభిమానులతోపాటు కుటుంబంలోనూ బాధను నింపింది. అంతేకాకుండా పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన పాలకొండ్రాయుడు కుటుంబాన్ని అధోగతిపాలు చేసేలా అధిష్టానం తీసుకున్న చర్యలపై సుగవాసి బాలసుబ్రమణ్యం కినుకు వహించారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు సంబేపల్లెకు వచ్చిన సందర్భంలోనూ, ఒంటిమిట్ట కల్యాణం సందర్భంలోనూ, ఇతర సందర్భాల్లోనూ బాలసుబ్రమణ్యంకు అవకాశం ఇవ్వకుండా చేయడంపై కుటుంబంలో కలకలం రేగింది. ఈ నేపథ్యంలో పొమ్మనకుండానే పొగబెడుతున్న అధిష్టానం తీరు నచ్చక సుగవాసి బాలసుబ్రమణ్యం టీడీపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రమాదంలో మృతి చెందిన శంకర్

వీరపునాయునిపల్లె : బొలేరో క్యాంపర్, మోటార్ బైకు ఢీ కొన్న ఘటనలో వీరపునాయునిపల్లె మండలం మిట్టపల్లె గ్రామానికి చెందిన లింగాల శంకర్ (38) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంగళవారం రాత్రి మిట్టపల్లె అయ్యవారిపల్లె గ్రామాల మధ్యలో బొలేరో వాహనం ఎదురుగా వస్తున్న మోటార్ బైకును ఢీకొట్టింది. ఈ ఘటనలో శంకర్‌కు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని ఎస్‌ఐ మంజునాథ్ తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. ప్రమాదానికి అతి వేగమే ప్రధాన కారణమని ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగ కమిటీల్లో నియామకాలు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన పలువురిని పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. స్టేట్ గ్రీవెన్స్‌సెల్ విభాగం ప్రధాన కార్యదర్శిగా పులివెందుల నియోజకవర్గానికి చెందిన కుప్పం ప్రసాద్‌రావు, స్టేట్ ఆర్టీఐ విభాగం ప్రధాన కార్యదర్శిగా పులివెందులకు చెందిన పి.కిశోర్, స్టేట్ ఆర్టీఐ విభాగం సంయుక్త కార్యదర్శిగా బద్వేలు నియోజకవర్గానికి చెందిన ఇ.నాగసుబ్బారెడ్డిలను నియమించారు.

మతి స్థిమితం లేని మహిళ రిమ్స్‌కు తరలింపు


బాధితురాలిని ఆస్పత్రికి తరలిస్తున్న కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, శివారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప ఆర్టీసీ బస్టాండులో ఉంటున్న మానసిక రోగి హసీనాను గుర్తించి బుధవారం ఆర్టీసీ డ్యూటీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి ఆర్టీసీ అసిస్టెంట్ డిపో క్లర్క్ నారాయణ సహకారంతో రిమ్స్‌లోని మానసిక చికిత్సాలయానికి తరలించారు. హసీనా కర్నూలు జిల్లా బనగానపల్లె వాసి అని, వచ్చిరాని మాటలు మాట్లాడుతోందన్నారు. కడప నగరంలోని మనోబంధు ఫౌండేషన్ కోఆర్డినేటర్ పుత్తా శివారెడ్డి ఈ విషయాన్ని చిన్నచౌకు పోలీసు దృష్టికి తీసుకొచ్చారు. వారి సిఫార్సు మేరకు ఆమెను కడప రిమ్స్ మానసిక చికిత్సాలయానికి తరలించారు.

బీటెక్ రవి బంధువు వీరంగం



ట్రిపుల్ ఐటీలోకి వెళుతున్న బీటెక్ రవి అనుచరుల కార్లు


ట్రిపుల్ ఐటీలోకి ద్విచక్ర వాహనంలో వెళుతున్న బీటెక్ రవి బంధువు

- ట్రిపుల్ ఐటీ ఓల్డ్ క్యాంపస్‌లో క్యాంటీన్ మేనేజర్‌పై దాడి
- ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని జైస్వాల్ కంపెనీ వారికి బెదిరింపులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పులివెందుల నియోజకవర్గంలో రోజురోజుకు టీడీపీ గుండాలు రెచ్చిపోతున్నారు. దాడులు, బెదిరింపులతో చెలరేగిపోతున్నారు. ఏదో ఒక రకంగా భయపెట్టి పంతం నెగ్గించుకోవాలన్న ఆలోచనతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారం అండగా ఉందని, తమను ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో పేట్రేగి పోతున్నారు. ఎక్కడ చూసినా గొడవలు, బెదిరింపులతో ప్రత్యర్థులను బెదరగొట్టి పని కానిస్తుండడం ఆందోళన కలిగించే పరిణామం. వేంపల్లె మండలం ట్రిపుల్ ఐటీ ఓల్డ్ క్యాంపస్ పరిధిలో ఉన్న జైస్వాల్ కంపెనీకి చెందిన క్యాంటీన్‌ను ఎలాగైనా చేజిక్కించుకోవాలన్న ఉద్దేశంతో పులివెందుల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి బంధువు, వేంపల్లె మండల ఇన్‌చార్జి అయిన రఘునాథరెడ్డి రెచ్చిపోయారు. మీరు ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని, మేము నడుపుకోవాలంటూ బెదిరింపులకు దిగడంతోపాటు ఏకంగా అక్కడ ఉన్న జైస్వాల్ కంపెనీ మేనేజర్ ఖాన్‌పై దాడులకు తెగబడ్డారు. ప్రత్యేకంగా రెండు వాహనాలతోపాటు బైకుల్లో వచ్చిన రఘునాథరెడ్డి, అతని అనుచరులు బీభత్సం సృష్టించారు. ఈ వ్యవహారంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. ఇలాంటి ఘటనలతో టీడీపీ ప్రతిష్ట మరింత దిగజారుతోందని ఆ పార్టీలోని కొందరు నేతలు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు.

సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

టీటీడీ జేఈఓ వి.వీరబ్రహ్మం


బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న జేఈఓ వీరబ్రహ్మం

నందలూరు : టీటీడీ అనుబంధంగా ఉన్న శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయంలో జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను టీటీడీ జేఈఓ వి.వీరబ్రహ్మం ఆదేశించారు. అధికారులతో కలిసి ఆయన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. శ్రీ సౌమ్యనాథ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు జులై 5న ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల వరకు ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు వాహనసేవలు ఉంటాయన్నారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆలయ పరిసరాలు ప్రతి రోజూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు దర్శనం, తాగునీరు, ప్రసాదాలు పంపిణీలో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతి రోజూ హరికథలు, ఆధ్యాత్మిక, భక్తి, సంగీత కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈలు వెంకటేశ్వర్లు, మనోహరం, డిప్యూటీ ఈఓలు నటేష్‌బాబు, శివప్రసాద్, ప్రశాంతి, డీఎఫ్ఓ ఫణికుమార్ నాయుడు, పట్టణీకరణ నిపుణుడు శ్రీరాముడు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గొడవ కేసులో ఇద్దరికి రిమాండ్

మైలవరం : గొడవ కేసుకు సంబంధించి మండల పరిధిలోని అయ్యవారిపల్లె గ్రామానికి చెందిన శివబ్రహ్మం, సుధాకర్‌లను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శ్యామసుందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నెల 11వతేదీన అయ్యవారిపల్లెలో గ్రామ జాతర నిర్వహించారన్నారు. ఈ జాతరలో పాత కక్షల కారణంగా ఇరువురు గొడవ పడ్డారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చాపాడు : ప్రొద్దుటూరు – మైదుకూరు జాతీయ రహదారిలో గల నాగులపల్లె సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పుల్లయ్య అనే యువకుడికి గాయాలయ్యాయి. చాగలమర్రి సమీపంలోని మర్రిపల్లెకు చెందిన పుల్లయ్య బైక్‌లో ప్రొద్దుటూరు నుంచి మైదుకూరుకు వస్తుండగా బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన పుల్లయ్యను స్థానికులు ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనపై విచారణ చేస్తున్నారు.

సర్పంచ్ అవినీతిపై ప్రమాణానికి సై



ఫేక్ డాక్యుమెంట్లను చూపుతున్న ఎంపీపీ శేఖర్ యాదవ్

ప్రొద్దుటూరు : కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి అవినీతిని నిరూపించడానికి తాను ఎక్కడ ప్రమాణం చేయడానికైనా సిద్ధంగా ఉన్నానని ప్రొద్దుటూరు ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ తెలిపారు. టైం, డేట్‌ను ఆయనే ఫిక్స్ చేయాలని పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ఖాదరాబాద్ గ్రామంలో ఉన్న తన స్థలానికి సంబంధించి ఫేక్ డాక్యుమెంట్లను తయారు చేసి తాను నిర్మిస్తున్న కట్టడాన్ని కూల్చారన్నారు. దీనిని తాను అడ్డుకున్నానన్నారు. తన స్థలం ఖాదరాబాద్‌లో ఉండగా టీడీపీ కౌన్సిలర్ మునీర్ అహ్మద్ తయారు చేసిన డాక్యుమెంట్‌లోని సర్వే నంబర్ ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని బ్రాందీ షాపు సిద్దయ్య ఇంటి వద్ద ఉందన్నారు. సర్పంచ్ శివచంద్రారెడ్డి ప్రమేయంతోనే తన స్థలంలోని నిర్మాణాన్ని కూల్చారన్నారు. ఎన్నడూ లేని విధంగా సర్పంచ్ అయ్యాక శివచంద్రారెడ్డి భూ కబ్జాలు, ఆక్రమణలు, బెదిరింపులతో కోట్ల రూపాయలు ఆర్జించారని ఆరోపించారు. శివచంద్రారెడ్డి సర్పంచ్ కాకముందు ఆయనకు ఎంత ఆస్తి ఉందో.. ఇప్పుడు ఆస్తి ఎంత ఉందో చెప్పాలని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సహకారంతో తాను సర్పంచ్ నుంచి ఎంపీపీ స్థాయికి ఎదిగానన్నారు. సమావేశంలో సోములవారిపల్లె సర్పంచ్ మోపూరి ప్రశాంతి, సానబోయిన శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

డీలర్‌ను వేధిస్తున్న తహసీల్దార్

చక్రాయపేట : మండలంలోని మహదేవపల్లె చౌక దుకాణపు డీలర్ ఊరిమిండి అంజనమ్మను తహసీల్దారు వేధింపులకు గురి చేయడమే కాకుండా మానసికంగా ఇబ్బంది పెడుతోందని చక్రాయపేట ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డిలు పేర్కొన్నారు. 1995 నుంచి రెగ్యులర్ డీలర్‌గా పనిచేస్తున్న అంజనమ్మ ఇప్పటి వరకు ఎలాంటి అక్రమాలకు పాల్పడ లేదన్నారు. అలాంటి డీలర్‌పై ఒకరిద్దరు టీడీపీ నేతలు ఫిర్యాదు చేయడంతో ఎలాంటి విచారణ లేకుండానే సస్పెండ్ శారన్నారు. దీంతో సదరు డీలర్ హైకోర్టు నుంచి స్టే తెచ్చుకొని ప్రజలకు నిత్యావసర సరకులను పంపిణీ చేస్తున్నారని చెప్పారు. అయితే కేవలం టీడీపీ వారి వత్తిళ్లకు లొంగి వారి మెప్పు పొందేందుకే ఇలా వ్యవహరిస్తున్నారని తహసీల్దారుపై ఆరోపణలు గుప్పించారు. ఈ విషయంపై తహసీల్దారు విజయకుమారిని వివరణ కోరగా తమకు ఫిర్యాదు రావడంతో విచారణ నిమిత్తం ఆర్ఐని, వీఆర్ఓను గ్రామానికి పంపామన్నారు.ఇంత వరకు తనకు వారు నివేదిక ఇవ్వలేదని, వేధింపులకు గురి చేయాల్సిన అవసరం తమకు లేదని ఆమె చెప్పారు.

నా ప్లాటుపై జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి

- టీడీపీ నాయకుడి దౌర్జన్యాలను అరికట్టండి
- మీడియాతో బాధితురాలు శ్రీపతి రామమునెమ్మ ఆవేదన


మీడియాతో మాట్లాడుతున్న బాధితురాలు శ్రీపతి రామమునెమ్మ, కుటుంబ సభ్యులు

పులివెందుల టౌన్ : తన ప్లాటుపై జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని బాధితురాలు శ్రీపతి రామమునెమ్మ కోరారు. బుధవారం పట్టణంలోని స్థానిక శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం కార్యాలయంలో ఆమె కుటుంబ సభ్యులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థలం విషయంలో తనకు అన్యాయం చేసిన టీడీపీ నాయకుడు అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డి, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎస్పీ అశోక్‌కుమార్‌లకు విన్నవించానన్నారు. తన స్థలాన్ని పునరుద్ధరించి రక్షణ కల్పించాలన్నారు. అలాగే ప్రభుత్వ కాలువ ఆక్రమణలతో పాటు సంబంధిత మున్సిపల్, రిజిస్ట్రేషన్ అధికారులపై కూడా విచారణ జరపాలని కోరారు. తన ప్లాటు నెంబర్ 10ను మల్లెల రాజేశ్వరి నుంచి కొనుగోలు చేశానని, రెవెన్యూ ఖాతాలో తన పేరు కూడా నమోదైందన్నారు. అయితే టీడీపీ నాయకుడు అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డి అసలైన అమ్మకందారుతో కలిసి అక్రమ లాభార్జన కోసం అదే లింక్ డాక్యుమెంట్‌ను ఉపయోగించి దొంగ రిజిష్టర్ చేయించుకున్నారన్నారు. అలాగే తన స్థలంతోపాటు పక్కన ఉన్న ప్రభుత్వ కాలువ భూమిని కూడా విజయ్‌కుమార్‌రెడ్డి ఆక్రమించాడని, మున్సిపల్ అనుమతులు లేకుండా ఇళ్లు నిర్మించారన్నారు. ఈనెల 23వ తేదీ సోమవారం రాత్రి విజయ్‌కుమార్‌రెడ్డి, లక్షుమయ్యలతోపాటు మరికొంతమంది రాత్రివేళ నిబంధనలకు విరుద్ధంగా తన స్థలంలోకి ప్రవేశించి సిమెంట్ నిల్వ కోసం ఏర్పాటు చేసిన రేకుల షెడ్డును ధ్వంసం చేసి జేసీబీ ద్వారా తన స్థలాన్ని చదును చేశారన్నారు. ఇది పూర్తిగా ప్రణాళిక ప్రకారం జరిగిన చర్య అన్నారు. ఈ ఆక్రమణల అనంతరం టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అండ చూసుకుని తనను తప్పుడు కేసులలో ఇరికిస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. టీడీపీ నాయకుడు అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డిపై పలు క్రిమినల్ కేసులు నమోదైనట్లు ఆమె తెలిపారు. వీరి ద్వారా తనకు ప్రాణ హాని ఉందని మీడియా ఎదుట వాపోయింది. సమావేశంలో భర్త శ్రీపతి చిన్నబాలుడు, కుమారుడు శ్రీపతి చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచిన సీడ్స్ యాజమాన్యం


మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి మస్తాన్, రామాయపల్లె రైతులు

పోరుమామిళ్ల : మొక్కజొన్న పంటకు పొలంలోనే డబ్బులు ఇచ్చి తీసుకెళతామని చెప్పి లక్ష్మీప్రసన్న సీడ్స్ యాజమాన్యం రైతులను నమ్మించి నట్టేట ముంచిందని సీపీఐ ఏరియా కార్యదర్శి పాడుగు మస్తాన్ ఆరోపించారు. బుధవారం ఆయన రైతులతో కలసి మొక్కజొన్న సీడ్స్ ఏజెంట్లు, యాజమాని నిర్వాకం వివరించారు. పోరుమామిళ్ల మండలంలో మొక్కజొన్న సీడ్స్ డీలర్ వెంకటేశ్వర రెడ్డి, ఏజంట్లు గురయ్య, శ్రీను, ప్రసాద్ రైతులకు విత్తనాలు ఇచ్చి, పండిన పంటకు క్వింటాకు రూ. 60 వేలు ఇస్తామని చెప్పారన్నారు. రామాయపల్లెలో వారి మాటలు నమ్మి మొక్కజొన్న సాగు చేసి వచ్చిన పంటను వారికి అందజేశారన్నారు. పంట తీసుకెళ్లిన సీడ్స్ యాజమాన్యం రైతులకు డబ్బు ఇవ్వలేదన్నారు. రామాయపల్లె రైతులతో పాటు సిద్దవరం, అగ్రహారం, క్రిష్టంపల్లె, కలసపాడు, బి.మఠం మండలాల్లో కొన్ని గ్రామాల్లోని రైతులు కూడా మోసపోయారన్నారు. సీడ్స్ కంపెనీ యాజమాన్యంపై అధికారులు చర్యలు తీసుకోవాలని, రైతులకు న్యాయంగా ఇవ్వాల్సిన డబ్బు ఇప్పించాలని ఆయన కోరారు.

గ్రేడ్ -2 జేఎల్‌ఎంల బదిలీల ఉపసంహరణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

కడప కార్పొరేషన్ : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న గ్రేడ్–2 జేఎల్‌ఎంల బదిలీలను ప్రభుత్వం ఉపసంహరించిందని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగసుబ్బయ్య తెలిపారు. బుధవారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయ ఉద్యోగుల విధివిధానాలను అనుసంధానం చేస్తూ ఈపీడీసీఎల్ ఇచ్చిన ఉత్తర్వులు సరికాదని, గ్రేడ్–2 జేఎల్‌ఎంలను విద్యుత్ ఉద్యోగులతో సమానంగా చూడాలని, విద్యుత్ సంస్థ సర్వీసు రెగ్యులేషన్స్, ఆ సంస్థ నిర్వహించే బదిలీలే వారికి కూడా వర్తిస్తాయని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. ఈ మేరకు గ్రేడ్–2 జేఎల్‌ఎంల బదిలీలను నిలుపుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి, కడప డివిజన్ నాయకులు సురేంద్ర, శివ ప్రసాద్ రెడ్డి, గోపి, శీలం సుబ్బరాయుడు నందీశ్వర్ రెడ్డి, నాగ శేష, రమణాచారి, శివ, నిఖిల్, పాల్గొన్నారు.

దొంగలున్నారు జాగ్రత్త!


- జమ్మలమడుగు కెనరా బ్యాంకులో దొంగల హస్త లాఘవం
- ఖాతాదారుల సెల్ ఫోన్లు, నగదు చోరీ


ఖాతాదారులతో రద్దీగా ఉన్న కెనరా బ్యాంకు

జమ్మలమడుగు : పట్టణంలోని ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న కెనరా బ్యాంకులో దొంగలు తమ హస్త లాఘవాన్ని ప్రదర్శిస్తున్నారు. బుధవారం బ్యాంకులో ఖతాదారులు ఎక్కువ సంఖ్యలో లావాదేవీల కోసం క్యూ కట్టారు. బ్యాంకు చిన్నది కావడం ఖాతాదారులు సంఖ్య ఎక్కువ కావడంతో ఇదే అదనుగా భావించిన కొంత మంది దొంగలు ఖాతాదారుల సెల్ ఫోన్లతోపాటు జేబుల్లో ఉన్న నగదుకు కత్తెర పెట్టారు. ఖాతాదారులు పనులు పూర్తి అయిన తర్వాత బ్యాంకు బయటికి వచ్చి ఫోన్లు కనిపించలేదు. బ్యాంకులో మొత్తం గాలించినా ఫలితం కనిపించలేదు. మైలవరం మండలం నార్జాంపల్లి గ్రామానికి చెందిన రైతు రామసుబ్బారెడ్డికి సంబంధించిన కీప్యాడ్ కలిగిన సెల్‌ఫోన్ పోగా, ఎర్రగుడికి చెందిన రైతు మాబుసా అ జేబులో ఉన్న రెండు వేల నగదు పోయింది. గతంలో మండల పరిధిలోని పెద్దదండ్లూరు గ్రామానికి చెందిన మహిళ వద్ద నుంచి పది తులాల బంగారాన్ని ఇదే బ్యాంకులో దొంగిలించారు. గతంలో కెనరా బ్యాంక్ ఒక్కటే ఉండటంతో ఖాతాదారులు తక్కువ సంఖ్యలో ఉండేవారు. అయితే సిండికేట్ బ్యాంక్‌ను కెనరా బ్యాంక్‌లో విలీనం చేయడంతో ఖాతాదారుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. బ్యాంకు చిన్నదిగా ఉండటం ఖాతాదారులు ఎక్కువ సంఖ్యలో ఉండటం దొంగలకు కలిసి వచ్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాతాదారులకు భద్రత కల్పించాలని కోరుతున్నారు.

బైక్‌ను ఢీ కొన్న ఆర్టీసీ బస్సు

యువకుడికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన యువకుడు రంగయ్య

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని నాలుగు రోడ్లు కూడలిలో బుధవారం రాత్రి ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీ కొన్న సంఘటనలో పల్లె రంగయ్య అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. చాపాడు దళితవాడకు చెందిన పల్లె రంగయ్య చియ్యపాడులోని తన సోదరి ఇంటికి వెళ్లి బైక్‌లో రాత్రి 9.20 గంటల ప్రాంతంలో చాపాడుకు వస్తుండగా.. ఇదే క్రమంలో ప్రొద్దుటూరు నుంచి చెన్నైకి వెళుతున్న ఆర్టీసీ బస్సు రోడ్డు దాటుకుంటున్న రంగయ్యను ప్రమాదవశాత్తు ఢీ కొంది. ఈ ప్రమాదంలో రంగయ్య తలకు తీవ్ర గాయాలు కాగా తీవ్ర రక్త స్రావం అయింది. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించి ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ చిన్న పెద్దయ్య సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా దీశారు. ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు, బైక్‌ను అదుపులోకి తీసుకున్నారు.

వేడినీళ్లు పడి బాలుడికి గాయాలు

మదనపల్లె రూరల్ : వేడినీళ్లు పడి బాలుడు గాయపడిన సంఘటన బుధవారం మండలంలో జరిగింది. వేంపల్లె క్రాస్‌కు చెందిన రవి కుమారుడు మానిష్ (6) ఇంట్లో ఆడుకుంటూ ప్రమాదశాత్తు వేడినీళ్లు ఉన్న పాత్రలో పడ్డాడు. ప్రమాదంలో బాలుడికి గాయాలు కాగా గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మైదుకూరు : మండలంలోని ఉప్పుగుంటపల్లె సమీపంలోని కొండ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నట్టు అర్బన్ సీఐ కేవీ రమణారెడ్డి తెలిపారు. మృతదేహం ఎవరిదైంది గుర్తుపట్టలేనంతా మారిందని, 20 రోజుల కిందట మృతి చెంది ఉండవచ్చని సీఐ పేర్కొన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఎవరి సంబంధీకులైనా మిస్సింగ్ అయి ఉంటే అర్బన్ సీఐ 9121100618, సబ్ ఇన్‌స్పెక్టర్ 9121100619, 9121100620 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అతిగా మద్యం తాగి..

మదనపల్లె రూరల్ : అతిగా మద్యం తాగి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని చిత్తూరు బస్టాండు టౌన్ హాలుకు సమీపంలో షాపు రూముల ముందు ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. మృతి చెందిన వ్యక్తి మంగళవారం ఉదయం నుంచి అక్కడే ఉంటూ మద్యం సేవిస్తున్నాడని బుధవారం మధ్యాహ్నం వరకు మెలకువగానే ఉన్నట్లు స్థానికులు తెలిపారు. అతిగా మద్యం తాగడం వల్ల ఆరోగ్యం దెబ్బతిని పరిస్థితి విషమించి మృతి చెంది ఉంటాడని తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న వన్‌టౌన్ పోలీసులు మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

మదనపల్లె రూరల్ : ఉరివేసుకుని గుర్తు తెలియని వ్యక్తి (55) మృతి చెందిన సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. బెంగళూరు రోడ్డు చిప్పిలి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తి నైలాన్ తాడుతో ఉరి వేసుకోగా, దాదాపు రెండు రోజుల క్రితం సంఘటన జరిగి ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

సీటు వదలని అక్రమార్కుడు!

- పోస్టింగ్ పోరుమామిళ్లలో.. పనిచేసేది కడప డీఐఈఓ ఆఫీసులో
- బదిలీ వచ్చినా అక్కడికి వెళ్లి చేరి మళ్లీ డీఐఈఓ ఆఫీసులోనే విధులు


కడపలోని ఇంటర్మీడియట్ కార్యాలయం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : సాధారణంగా ఎవరైనా ఎనిమిదేళ్లు ఒక చోట పనిచేస్తే ప్రభుత్వం నిర్వహించే బదిలీల్లో కచ్చితంగా స్థాన చలనం పొందాలి. కానీ కడప ఇంటర్మీడియట్ డీఐఈఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఒక వ్యక్తికి ఎనిమిది సంవత్సరాలు సర్వీసు పూర్తి కావడంతో ఇటీవల నిర్వహించిన బదిలీల్లో పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీ చేశారు. దీంతో ఆయన ఈ నెల 13వ తేదీ పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధుల్లో చేరారు. అయితే ఇంతవరకు కళాశాలకు వెళ్లకుండా అనధికారంగా డీఐఈఓ కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తున్నారు. అలా కొనసాగడానికి తగిన ఉత్తర్వులు కూడా లేవు. ఇతను బదిలీ అయినా తిరిగి డిప్యూటేషన్ మీద డీఐఈఓ ఆఫీసుకు తెచ్చుకునేందుకు తగిన ప్రతిపాదనలను ఆర్‌జేడీకి సంబంధం లేకుండా కమిషనర్ కార్యాలయానికి నేరుగా డీఐఈఓ కార్యాలయం నుంచి వెళ్లినట్లు తెలిసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల పోరుమామిళ్ల నుంచి డిప్యూటేషన్ మీద డీఐఈఓ ఆఫీసుకు తెచ్చుకునేందుకు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ నుంచి కూడా అనుమతి తీసుకోవాలి. అలా కూడా చేయకుండా అనధికారికంగా డీఐఈఓ కార్యాలయంలోనే కొనసాగుతున్నట్లు తెలిసింది. ఈయన జిల్లాలోని ఎయిడెడ్ కళాశాలల్లో పనిచేసే సిబ్బందికి జీతాలు చేసేందుకు కూడా మామూళ్లు తీసుకుంటాడనే ఆరోపణలు కూడా ఉన్నాయి. డీఐఈఓ కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్‌కు బదిలీ అయినా తిరిగి డీఐఈఓ కార్యాలయంలో కొనసాగించే విషయంపై విద్యార్థి సంఘాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. ఈ విషయమై డీఐఈఓ వెంకటేశ్వర్లును వివరణ కోరగా ఈ జిల్లాకు తాను కొత్తగా వచ్చానని, ఈయన సేవలు కార్యాలయంలో తనకు అవసరం కనుక ఇక్కడే కొనసాగించుకుంటున్నానని తెలిపారు. ఇతనిని డీఐఈఓ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై తెచ్చుకునేందుకు ప్రతిపాదనలు కూడా పంపామని తెలిపారు.

గుండెపోటుతో మిలటరీ అధికారి మృతి


శివప్రకాశ్‌రెడ్డి (ఫైల్)

తొండూరు : మండల కేంద్రమైన తొండూరు గ్రామానికి చెందిన హవల్దార్ బూచుపల్లి శివప్రకాశ్‌రెడ్డి (43) గుండెపోటుతో మృతి చెందారు. బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం తొండూరు నుంచి పులివెందులకు కారులో ప్రయాణిస్తుండగా పులివెందుల సమీపంలోని టి.తుమ్మలపల్లి గ్రామం వద్దకు రాగానే గుండెపోటుకు గురై మృతి చెందినట్లు తెలిపారు. ప్రకాష్‌రెడ్డి పంజాబ్‌లోని కుర్రోల్పూర్‌లో 7 ఆర్టీ బ్రిడ్జి అధికారిగా పనిచేసేవాడన్నారు. సెలవు మీద ఇంటికి వచ్చి వ్యక్తిగత పని మీద పులివెందుల వెళ్తుండగా మార్గ మధ్యంలో గుండెపోటుతో మృతి చెందారు. మృతుడికి భార్య నాగేశ్వరితోపాటు ముగ్గురు పిల్లలు అక్షిత, జ్యోత్స్న, రిత్విక్ రెడ్డి ఉన్నారు.

వన్యప్రాణులను వేటాడుతున్న వ్యక్తి అరెస్టు


అరెస్టు చేసిన నిందితుడితో అటవీ శాఖ అధికారులు

మైదుకూరు : మండలంలోని గంగాయపల్లె అటవీ బీట్ పరిధిలో వన్యమృగాలను వేటాడుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు వనిపెంట అటవీ రేంజ్ అధికారి ప్రణీత్ రావు బుధవారం తెలిపారు. మండలంలోని జాండ్లవరం గ్రామానికి చెందిన కొందరు కొన్నేళ్లుగా గంగాయపల్లె బీట్‌లో నాటు తుపాకులతో వన్య మృగాలను వేటాడుతున్నారని ఆయన తెలిపారు. వారి కోసం నిఘా ఉంచి మంగళవారం ఓ వ్యక్తిని పట్టుకున్నట్టు పేర్కొన్నారు. అతని వద్ద నుంచి నాటు తుపాకీ, మందు గుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. నిందితుడిని బుధవారం కోర్టుకు హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ అన్వర్ హుస్సేన్, ఎఫ్‌బీఓ సురేఖ, ఏబీఓ సునీత పాల్గొన్నారు.